క్లుప్తంగా

రేపు చలో ఇందిరా పార్కు

మంచాల: విద్య, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయి నష్టపోయిన బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. చాలా కాలం నుంచి ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. మహాధర్నాలో అధిక సంఖ్యల్లో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


రాజును సన్మానించిన సభ్యులు


కడ్తాల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కర్కల్‌పహాడ్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు మైలారం రాజు అన్నారు. శనివారం మండలంలోని కర్కల్‌పహాడ్‌లో నూతనంగా ఎన్నికైన అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు మైలారం రాజుతో పాటు, కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీను, రాజు, రమేశ్,జగన్, అంజి, శివకృష్ణ, నాని, బాలు, శ్రీశైలం ఉన్నారు.

క్రిస్టియన్లపై దాడులను అరికట్టాలి


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

తుర్కయంజాల్: క్రైస్తవులుగా దేశ అభివృద్ధి, శాంతి, క్షేమాన్ని కోరుచున్నామని, హింసను కాదని కౌన్సిలర్ కాకుమాను సునీల్, బాలయేసు, అద్భుత పుణ్యక్షేత్రం ఫాదర్ వి.జే. చిన్నపరెడ్డిలు పేర్కొన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు నిరసనగా తుర్కయంజాల్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్ జి.సువర్ణ రాజు, యేసుబాబు, రాజుతో పాటు పెద్ద సంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొన్నారు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఎండీ యూసుఫ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.29 వేలు మంజూరయ్యాయి. శనివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధితుడు యూసుఫ్‌కు రూ. చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ ఖలీల్, కిరణ్, శివ, రాజేందర్, నాయిమ్ ఉన్నారు.

గట్టుఇప్పలపల్లిని మండలం చేయాలి

కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్


దీక్షలు చేస్తున్న డేవిడ్, తదితరులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 48వ రోజుకు చేరాయి. డేవిడ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటుకు అన్ని అర్హతలున్నా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత 48 రోజులుగా దీక్షలు చేస్తున్నా ఏ మాత్రం చలనం లేదన్నారు. నల్గొండ జిల్లా దేవరకొండ డివిజన్ పరిధిలోని 11 గ్రామాలతో గుడిపల్లిని మండలంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామానికి కూడా 11 గ్రామ పంచాయతీలు మద్దతిస్తున్నట్లు తీర్మానం చేశాయని చెప్పారు. గుడిపల్లి మాదిరిగానే గట్టుఇప్పలపల్లిని కూడా మండలంగా ప్రకటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో దైవానందం, చెన్నయ్య, లక్ష్మణరావు, లక్ష్మీపతి, ఈదమయ్య, చంద్రయ్య, సాయిలు, సర్పంచ్‌లు జయమ్మ, వెంకటయ్య, నాగమణి, లింగంగౌడ్, దామోదర్, రేణురెడ్డి, వాల్మీకి, నరహరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే ‘పథకాలు’

- దళితుడిని సీఎం చేస్తానని హామీ ఇవ్వ
- పథకాలన్నీ బీఆర్‌ఎస్ శ్రేణుల కోసమే
- ధరణి పోర్టల్‌తో రైతుల్లో భయాందోళన
- బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా
- యాచారంలో బీజేపీ మహాధర్నా



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

యాచారం: రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసమే సీఎం కేసీఆర్ స్కీం..స్కాంలు అమలు చేస్తున్నాడని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా పేర్కొన్నారు. దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి తదితర పథకాలను గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన పేదలకే ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పెట్టే స్కీం, స్కాం పథకాలు ఎన్నికల కోసమేనని ఆరోపించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఏ పథకం కొనసాగదన్నారు. సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే వచ్చే ఎన్నికల్లో దళితుడినే సీఎం చేస్తానని ప్రకటించి, దళితులకు మూడు ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని సవాల్ విసిరారు. దళిత కుటుంబాలకు దళితబంధు కింద ఇంటికో రూ. 10 లక్షలు అందజేయాలి, గృహలక్ష్మి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూముల స్కాం నడుస్తోందని తెలిపారు. ధరణి పోర్టల్ తెచ్చి రైతులకు తమ వ్యవసాయ భూములు రికార్డుల్లో ఉంటున్నాయో.. లేవోనని భయాందోళన పట్టుకుందని వివరించారు. వీఆర్‌ఏ, వీఆర్‌ఓల తొలగింపుతో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ధరణి పోర్టల్‌తో లక్షలాది మంది రైతులకు పట్టాదారు, పాసుపుస్తకాలు రాక రైతుబంధు, రైతుబీమా, బ్యాంకుల్లో పంట రుణాలు అందక నష్టపోతున్నారని అన్నారు. మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో గజం ప్రభుత్వ భూమి మిగలదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, చెట్ల పెంపకం, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలు, చెత్త తొలగించే ట్రాక్టర్లకు కేంద్రమే నిధులు ఇస్తుందని చెప్పారు.

బీజేపీలో జోష్ పెంచిన ర్యాలీ..

యాచారంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా ర్యాలీ బీజేపీ శ్రేణుల్లో జోష్ పెంచింది. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న బీజేపీ శ్రేణులు సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకే ఇవ్వాలని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సాష్టాంగ నమస్కారం చేశారు. అనంతరం వందలాది మంది శ్రేణులు ప్లకార్డులు చేతిలో పట్టుకుని ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ర్యాలీ అనంతరం మండల పంచాయతీ అధికారి ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాచారం గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు యాదయ్య, జంగయ్య, రమేష్, జంగయ్యగౌడ్, శ్రీధర్‌గౌడ్, శ్రీశైలం, కృష్ణ, రాజు, శ్రీనువాస్‌యాదవ్, శాంతికుమార్, శ్రీనాథ్, నరేష్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండ కాంగ్రెస్ జెండా

పార్టీ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి


సమస్యలు తెలుసుకుంటున్న రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ జెండా ఎల్లప్పుడు పేద ప్రజలకు అండగా ఉంటుందని, కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో గడపగడపకూ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి, ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, గ్రామంలో అనారోగ్యానికి గురై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న 5 కుటుంబాలను పరామర్శించి, కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండ్లీ రాములు, మున్సిపాలిటీ అధ్యక్షుడు మానయ్య, నాయకులు అనిల్‌గౌడ్, కృష్ణ, రవి, రాజశేఖర్, శ్రీను, రాజు, సురేశ్, రఘు ఉన్నారు.

ఘనంగా నాభిశిలా పునఃప్రతిష్ఠ


పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాయపోల్‌లో నాభిశిలా పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు శనివారం ప్రారంభించారు. నూతనంగా ప్రతిష్ఠించనున్న బొడ్రాయికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, ఎంపీటీసీలు జ్యోతి, శ్రీశైలం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే భోజనం

- గదుల కొరత, ఇవ్వని క్రీడాసామగ్రి
- విద్యార్థులకు అందని పరుపులు


తలకొండపల్లి: భోజనం చేస్తున్న విద్యార్థినులు


కడ్తాల్: ఆశ్రమ పాఠశాలలో పరుపులు లేని బెడ్‌లు

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ పాఠశాలను శనివారం మధ్యాహ్న భోజన సమయంలో సాక్షి విజిట్ చేయగా ఆకుకూరతో కూడిన పప్పు, సాంబార్, అన్నం వడ్డించారు. వారానికి రెండు సార్లు అరటిపండు, గుడ్లు, ఆదివారం చికెన్‌తో కూడిన బగారా రైస్ అందిస్తున్నారని, ఉదయం జీరా రైస్, రాగి మాల్ట్ అందిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఆయా పాఠశాలలో మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నా ఇతరత్రా సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయని సాక్షి దృష్టి వచ్చాయి. 200 మంది విద్యార్థులు ఉన్న మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల అద్దెభవనంలో కొనసాగుతుండగా, విద్యార్థులకు గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వం నిర్మిస్తున్న కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో విద్యార్థులకు అద్దెభవనంలో ఇబ్బందులు తప్పడం లేదు. త్వరగా నూతన భవన నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో 290 మంది వరకు విద్యార్థులు ఉండగా, వారికి నేటికి పరుపులు అందలేదని, కొన్ని గదులకు కిటికీలు లేవని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. అలాగే, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 420 మంది విద్యార్థులు ఉండగా , శనివారం 355 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉన్నారు. పాఠశాలలో తరగతి గదులు చాలక పోవడంతో, స్టాఫ్‌కు కేటాయించిన గదులలో పలువురు విద్యార్థులు వసతి పొందుతున్నారు. చాలా మంది విద్యార్థులకు ఎలాంటి బెడ్ సౌకర్యం లేక పోవడంతో నేలపైనే పడుకుంటున్నామని విద్యార్థులు వాపోయారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూమ్స్ లేవని, ఆట స్థలం సరిగ్గా లేదని, క్రీడాపరికరాలు రాలేదని విద్యార్థులు చెప్పారు.

మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు..

తలకొండపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాంలు పంపిణీ చేశారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు విద్యార్థినులు తెలిపారు.


చెరిగిపోని జ్ఞాపకం ఫొటో


కడ్తాల్: నివాళి అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్


యాచారంలో..


తలకొండపల్లిలో..

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ఆమనగల్లులో..

కడ్తాల్: గడిచిపోయిన కాలం మధుర స్మృతులను, మదిలో ముద్రించే చెరిగిపోని జ్ఞాపకమే ఫొటో అని మండల ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. కడ్తాల్ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితమహుడు ‘లూయిజ్ జాక్వేస్ మండే దాగురే’ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లు ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఫొటో గ్రాఫర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. నేడు ఫొటోగ్రఫీతో ఎంతో మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఫొటో గ్రాఫర్ల సంక్షేమానికి బ్యాంకుల ద్వారా పెద్ద మొత్తంలో రుణాలిప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘం ఉపాధ్యక్షుడు రబ్బానీ, కార్యదర్శి బీష్మాచారి, కోశాధికారి కిరణ్, శ్రీను, మహేశ్, కృష్ణ, ధనంజయ్‌గౌడ్, శివ, మహేందర్, నవీన్, ప్రవీణ్, నదీమ్ ఉన్నారు.

యాచారంలో..

యాచారం: మండల కేంద్రంలో 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరిపారు. ఫొటో సృష్టికర్త లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేటి ఆధునిక యుగంలో రకరకాల మొబైల్ ఫోన్లు రావడంతో ఫొటోగ్రాఫర్లకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాల్సిన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేష్ యాదవ్, లింగం, నడ్డి విజయ కుమార్ పాల్గొన్నారు.

తలకొండపల్లిలో ..

తలకొండపల్లి: మండల కేంద్రంలో శనివారం ఫొటోగ్రఫర్ యూనియన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి తమ ఐక్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, శంకర్, యాదగిరి, రవూఫ్, మధు, విజయ్, ఆంజనేయులు, నాగేష్, నర్సింహ, కృష్ణ, చెన్నకేశవులు, మహేష్, మల్లేష్, శ్రీను, కిరణ్, సాయి, రంగా పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితమహుడు లూయిస్ దాగరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. అనంతరం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కుటుంబ భరోసా స్కీంలో చేరాల్సిందిగా కోరారు. పభుత్వం కుటుంబ భరోసా రూ.100 స్కీం ప్రారంభించిందని, ఆసక్తి గల వారు పథకంలో చేరాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ శ్రీశైలం, వెంకటేశ్, జావీద్, గిరి, వెంకటేశ్, శివకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ అధ్యయన యాత్ర


ముగింపు సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ఇబ్రహీంపట్నం: గత రెండు రోజులుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై నిర్వహించిన అధ్యయన యాత్ర శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ మాట్లాడుతూ.. యాచారం, మంచాల మండలాల మీదుగా ఈ యాత్ర సాగిందన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు, భోజన వసతి సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు విష్ణుకుమార్, శ్రీకాంత్, వినోద్, వంశీ, వినయ్, లక్ష్మణ్, సంపత్, శంకర్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు పరమేశ్‌కు డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న పరమేశ్

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా ఉపాధ్యాయులకు అండగా ఉంటూ, సమాజ సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వర్కాల పరమేష్‌ను డాక్టరేట్ వరించింది. యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ పరమేష్ చేస్తున్న సేవలకు డాక్టరేట్ పురస్కారాన్ని ప్రధానం చేసి గౌరవించింది. శనివారం బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ ఫ్రాన్సిస్, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పరమేష్ ప్రస్తుతం పనిచేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్ ఉన్నారు.

రాజ్యాధికారం కోసం కృషి చేద్దాం

శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: బడుగుల రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ పేర్కొన్నారు . శుక్రవారం రాత్రి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీలోనైనా తన వారికి సీట్లు వస్తే ఓట్లు వేసి గెలిపించుకోవాలని కోరారు. మహిళా సాధికారితకు పాటుపడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లతో సర్ధార్ పాపన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. అలాగే, గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ ,ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక, పీసీసీ సభ్యులు శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్ , హరిదాసులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘రేపు హలో విద్యార్థి.. చలో కలెక్టరేట్ ’


విద్యార్థులతో మాట్లాడుతున్న శివకుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 21 హలో విద్యార్థి.. ఛలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు రంగారెడ్డి జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి గుండె శివకుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొనాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన అధ్యయన యాత్రలో విద్యారంగ సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అనేక డిమాండ్లతో కలెక్టరేట్ ముట్టడిని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు స్టాలిన్, వంశీ, షాషు, సాయి, గణేష్, రవి, అభిన్ పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు


జెండా ఊపి 5కె రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రజలకు వజ్రాయుధంలాంటిదని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 5కే రన్ కార్యక్రమం శనివారం జెండా ఊపి ఆర్డీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కృష్ణ, పాల్గొన్నారు.

మళ్లీ ఆశీర్వదించండి


పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా, తనను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి సర్పంచ్ ఎండీ హబీబుద్దీన్, ఎంపీటీసీ సభ్యురాలు సుమతమ్మల ఆధ్వర్యంలో శనివారం గ్రామంలోని పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించండి.. మీ సేవకుడిగా పని చేస్తానని వేడుకున్నారు. ఇబ్రహీంపట్నాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేశానే తప్ప.. మిగతా సమయాల్లో ప్రజల సమస్యలు, అభివృద్ధే లక్ష్యంగా కృషి చేశానని వివరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, బీఆర్‌ఎస్ నాయకుడు లోహిత్‌రెడ్డి ఉన్నారు.

రాంరెడ్డి మృతదేహానికి నివాళి

మంచాల: మండల కేంద్రంలో శనివారం అండెం రాంరెడ్డి(79) అనారోగ్యంతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్ కూడా రాంరెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, సర్పంచ్ జగన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బీఆర్‌ఎస్ నాయకుడు పరమేశ్


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల కార్యకర్తలు

కడ్తాల్: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. శనివారం మండలంలోని అన్మాస్‌పల్లిలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మహేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్ సమక్షంలో, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పరమేశ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా పరుగులు పెడుతుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి, అన్ని పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్యయాదవ్, నర్సింహగౌడ్, రాజుగౌడ్,దాస్‌శ్రీను, దేవులా, కుమార్ ,రమేష్, గిరి, ప్రశాంత్, నరేందర్, శేఖర్,రవి, రాజు, సురేశ్, శేఖర్, కృష్ణ ఉన్నారు.